


# షార్లెట్ పెర్కిన్స్ గిల్‌మన్

**అనువాదం: ఎ.వి.రమణమూర్తి**

నాలాంటి, జాన్ లాంటి సాధారణమైన మనుషులకి వేసవి విడిదిగా అలాంటి భవంతి దొరకడం చాలా అరుదైన విషయమనే చెప్పాలి.

తరతరాలుగా అనువంశికంగా వస్తున్న ఒక రాజప్రాసాదంలాగా ఉందది. అలాంటి స్వర్గధామాన్ని అసలు ఆశించడం కూడా ఎక్కువే!

కానీ, అందులో ఏదో వైపరీత్యం ఉందని నా ప్రగాఢ విశ్వాసం.

లేకపోతే, అంత తక్కువ అద్దెకి అది ఎలా దొరుకుతుంది? అసలు అన్ని రోజులుగా అద్దెకి ఎవరూ దిగకుండా ఖాళీగా ఎలా ఉంటుంది?

అలా అంటే జాన్ నవ్వుతాడు. సరే, పెళ్లంటూ అయ్యాక అదే కదా జరిగేది!

జాన్ చాలా ప్రాక్టికల్‌గా ఉంటాడు. ఇలాంటి నమ్మకాలని పట్టించుకోడు సరికదా– తాకడానికీ చూడటానికీ అతీతంగా ఉండేవీ, అంకెల్లో ఇమడనివీ ఏ విషయం గురించైనా మాట్లాడితే హేళన చేస్తాడు.

జాన్ ఒక డాక్టర్. బహుశా (ఈ విషయం అందరికీ చెప్పననుకోండి; ఇది ప్రాణం లేని కాగితం కనక పెద్ద రిలీఫ్) — బహుశా, నా ఆరోగ్యం త్వరగా మెరుగుపడక పోవడానికి అది కూడా కారణం అనుకుంటా.

మీకు తెలుసా, నాకు అనారోగ్యం అని అతను ఒప్పుకోడు!

ఎవరైనా ఏం చేయగలరు?

చాలా మంచి డాక్టరని పేరున్న నా భర్త లాంటివాడు కూడా ఇదంతా నరాల బలహీనత, కొంచెం హిస్టీరియా ఛాయలు మాత్రమే అని బంధువులకీ, స్నేహితులకీ చెబుతుంటే, ఏం చేయాలి?

నా అన్నయ్య కూడా డాక్టరే. పేరున్నవాడే. అతనూ అదే అంటాడు.

ఇంకేం చేస్తాం? అదేదో ఫాస్ఫేటో ఫాస్ఫైటో తీసుకోవడం; టానిక్కులూ, విశ్రాంతి కోసం ప్రయాణాలూ, స్వచ్ఛమైన గాలీ, వ్యాయామం — ఇదీ వరస. నేను మళ్లీ బాగయ్యే వరకూ 'పని' అనేది చేయకూడదట.

వ్యక్తిగతంగా, వీళ్ల అభిప్రాయాలతో నేను ఏకీభవించలేను.

ఇష్టమైన పని, ఆ ఉత్సాహం, మార్పు — ఇవన్నీ నాకు మంచి చేస్తాయని నేను నమ్ముతాను.

కానీ ఏం చేయాలి?

ఇన్ని నిబంధనల మధ్య కూడా అప్పుడప్పుడూ రాసేదాన్ని. కానీ నిస్సత్తువగా అనిపిస్తుంది– రహస్యంగా ఆ పని చేయడానికీ, అది చేతకాకపోతే వాళ్లు అనేవాటిని తట్టుకోవడానికీ.

వాళ్ల ఆ వ్యతిరేకత పాలు కొంచెం తక్కువగా ఉండి, కొద్దిపాటి ప్రోత్సాహం ఉంటే ఎంత బాగుంటుంది! కానీ నా పరిస్థితి గురించి నేను అస్సలు ఆలోచించకూడదని జాన్ అంటాడు. ఇది నాకు బాధ కలిగిస్తుంది.

సరే, దాని మానానికి దాన్ని వదిలేసి ఇంటి గురించి మాట్లాడతాను.

అద్భుతమైన, అందమైన ఇల్లు! ఊరినుంచి మూడు మైళ్ల దూరంలో ఉంటుంది– రోడ్డుకి కొంచెం ఎడంగా. మంచి గోడలూ, తాళాలు వేసుకునే వీలున్న గేట్లూ, తోటా; తోటపనివారికీ, మిగతా వారికీ విడిగా చిన్నచిన్న ఇళ్లు– పాతకాలపు ఇంగ్లీష్ ఇళ్లు గుర్తుకొస్తాయి.

ఎంత అందమైన తోటో! అలాంటి గార్డెన్ నేనెప్పుడూ చూడలేదు. పెద్ద గార్డెన్– నలుచదరాల కాలిబాటలూ, పెద్ద చెట్లూ, వాటికింద కూర్చోవడానికి బెంచీలూ, నీడా!

ఒక గ్రీన్ హౌస్ కూడా ఉంది కానీ, ఇప్పుడది శిథిలావస్థలో ఉంది.

ఇల్లు ఏదో కోర్ట్ గొడవల్లో ఉందనుకుంటాను. వారసుల మధ్య వివాదాలు. ఏదేమైనా, సంవత్సరాల తరబడి ఇల్లు ఖాళీగా ఉంది.

అదేమీ పట్టించుకోను గానీ, ఈ ఇంటి వాతావరణంలో ఏదో తేడా ఉంది. అది నాకు తెలుస్తూనే ఉంది.

అప్పటికీ ఆ విషయం జాన్‌కి చెప్పాను. చలిగాలి తగిలి అలా అనిపిస్తోంది, అంతకుమించి మరేమీ లేదని కిటికీలు వేసేసాడు.

జాన్ మీద ఒక్కోసారి అకారణంగా కోపం వస్తూంటుంది. ఇంత సున్నితంగా ఇంతకుముందు ఉండేదాన్ని కాదు. బహుశా, ఈ నరాల సమస్య వల్లనే అయివుండాలి.

సరైన ఆత్మనిగ్రహం లేక అలా అవుతోందంటాడు జాన్. నన్ను నేను కష్టం మీద నియంత్రించుకోవడానికే ప్రయత్నిస్తూ ఉంటాను– కనీసం అతని ముందు. కానీ ఆ ప్రయత్నం చాలా అలసట తెప్పిస్తుంది.

మేముండే ఈ రూమ్ నాకు బొత్తిగా నచ్చదు. కింద ఒక రూమ్ తీసుకుంటానన్నాను. చక్కగా కిటికీ పక్కనే గులాబీలు, తోటా కనిపిస్తూ ఉంటాయి. జాన్ కనీసం వినిపించుకోడు.

కింద రూమ్‌కి ఒక్కటే కిటికీ ఉందంటాడు. రెండు మంచాలు పట్టవంటాడు. తనకి అవసరమైతే కింద మరో రూమ్ లేదంటాడు.

చాలా ప్రేమ ఉన్నవాడే. ఏవో జాగ్రత్తలు చెప్పకుండా నన్ను ఎటూ పోనివ్వడు కూడా.

గంటగంటకీ ఏవో మందులు తీసుకుంటూనే ఉండాలి నేను. అన్నీ తనే చూసుకుంటాడు. అవన్నీ విస్మరించి, సరైన కృతజ్ఞతాభావం నేనే చూపించడం లేదేమో అనిపిస్తుంది.

ఇక్కడికి వచ్చిందే నా గురించి అంటాడు. పూర్తి విశ్రాంతీ, మంచి స్వచ్ఛమైన గాలీ అవసరమంటాడు. "ఒంట్లో శక్తి ఉంటేనే వ్యాయామం చేయగలవు. ఆకలి ఉంటేనే మంచి తిండైనా తినగలవు. కానీ మంచిగాలి అనేది ఎప్పుడైనా పీలుస్తూనే ఉండవచ్చు," అంటాడు. అందువల్ల, పైన చిన్నపిల్లల బెడ్‌రూమ్ తీసుకున్నాం.

గాలి ధారాళంగా వచ్చే పెద్ద రూమ్ అది. అన్నివైపులకీ కిటికీలుండి, గాలీ వెలుతురులతో దాదాపు పై అంతస్తంతా ఉన్న రూమ్. ఇంతకుముందు ఇది

చిన్నపిల్లల బెడ్‌రూమో, ఆడుకునే రూమో, వ్యాయామశాలో అయివుండాలి. ఎందుకంటే, కిటికీలు చిన్నపిల్లల కోసం ప్రత్యేకంగా చేసినట్టున్నారు; గోడలకి రింగులూ అలాంటివేవో ఉన్నాయి.

గదికి వేసిన పెయింటూ, వాల్‌పేపర్ చూస్తే, అవేవో చిన్నపిల్లల స్కూల్ కోసం వేసినట్టున్నాయి. నా బెడ్ ఎత్తునుంచి కొంత ఎత్తువరకూ, అన్నివైపుల గోడలమీద ఆ వాల్‌పేపర్ అక్కడక్కడా చించివేయబడి ఉంది, మాసికలు మాసికలుగా కనిపిస్తూ. ఇంతకన్నా ఘోరమైన వాల్‌పేపర్ నేనెక్కడా చూడలేదు.

అలా అన్నివైపులా పరుచుకుని ఉన్న ఆ మాసికల ఆకృతులు కళ పట్ల అన్నిరకాల అఘాయిత్యాలూ చేస్తున్నాయి.

ఆ ఆకారాలని అలా పరిశీలిస్తూ కళ్లని కలవరపెట్టడం డల్‌గా అనిపిస్తుంది. ఒకవేళ ఆ పద్ధతిలేని వక్రరేఖల్ని కొంతదూరం అనుసరిస్తూ పోయినా, అవి కొంతదూరం పోయి అకస్మాత్తుగా ఆత్మహత్యలు చేసుకుంటాయి – కొత్త కోణాల్లోకి దూసుకుపోతాయి, అర్థం లేని వైరుధ్యాలలో అవి సమసిపోతాయి.

ఆ రంగు వికారాన్నీ, రోతనీ పుట్టిస్తుంది. వెలుతురులో పడి మాసిపోయే ఒక రకమైన మురికి పసుపురంగు.

కొన్ని ప్రదేశాల్లో మాసిపోయిన బ్రైట్ ఆరెంజ్; కడుపులో తిప్పినట్టుండే సల్ఫర్ ఛాయ మరికొన్ని చోట్ల.

పిల్లలు కచ్చితంగా అసహ్యించుకుని ఉంటారు. ఇంకొన్నాళ్లు ఇక్కడే ఉంటే నేనూ బహుశా అంతేనేమో.

జాన్ వస్తున్నట్టున్నాడు, దీన్ని పక్కన పెట్టేయాలి. ఒక్క మాట రాసినా, అతనికి నచ్చదు.

★★★

ఇక్కడికొచ్చి రెండు వారాలయింది. ఆ మొదటిరోజున తప్పిస్తే, మళ్లీ ఏమీ రాయాలనిపించలేదు.

ప్రస్తుతం ఈ దారుణమైన చిన్నపిల్లల బెడ్‌రూమ్‌లో కిటికీ పక్కన కూచుని ఉన్నాను. ఓపిక లేకపోవడం తప్పించి, ఇప్పుడు నాకిష్టమైనంత రాసుకోవడానికి ఏ అడ్డంకీ లేదు.

జాన్ రోజంతా బయట ఉంటున్నాడు. సీరియస్ కేసులేవైనా ఉంటే ఒక్కోసారి రాత్రిళ్లు కూడా.

నాది సీరియస్ కేస్ కానందుకు సంతోషం!

కానీ ఈ నరాల జబ్బులు డిప్రెసింగ్‌గా ఉంటాయి.

అసలు నేను ఎంత బాధపడుతున్నానో జాన్‌కి తెలియదు. బాధపడటానికి అసలు కారణమే లేదనుకుంటాడు. అలా అనుకోవడం అతనికి తృప్తినిస్తుంది.

సరే, అది నెర్వస్‌నెస్ మాత్రమే అనుకుందాం. కానీ అది నా పనులని నన్ను చేసుకోనివ్వదే!

జాన్‌కి ఎంతో సహాయం చేయాలనీ, తనని జాగ్రత్తగా చూసుకోవాలనీ ఉంటుంది. ఇప్పుడిలా తనకి భారంగా తయారయ్యాను.

కానీ ఇప్పుడు చేస్తున్న కొంచెమే ఎంత ప్రయత్నపూర్వకంగా చేయాల్సివస్తోందో ఎవరికీ అర్థం కాదు. డ్రస్ చేసుకోవాలి, కనిపించినవాళ్లని పలకరించాలి, అవీ ఇవీ అడిగి తెప్పించుకుంటుండాలి.

మేరీ పిల్లాడిని బాగా చూసుకుంటోంది, అదో అదృష్టం. ఎంత చక్కటి పిల్లాడు!

కానీ, నేను పిల్లాడితో ఉండకూడదు. అది నన్ను నెర్వస్‌గా చేస్తుందిట.

అసలు జాన్ తన జీవితంలో ఎప్పుడూ నెర్వస్‌గా లేడనుకుంటాను. వాల్‌పేపర్ గురించి చెప్పినప్పుడల్లా నవ్వుతూ కొట్టిపారేస్తాడు!

ముందు ఆ వాల్‌పేపర్‌ని మారుద్దామనే అన్నాడు. కానీ తర్వాత, అది నా ఆలోచనలని అలా ఆక్రమించడం సరికాదనీ, అలాంటి ఊహలని దగ్గరకి రానివ్వడం నాలాంటి నెర్వస్ పేషెంట్లకి మంచిది కాదనీ అన్నాడు.

అలా మార్చడం మొదలుపెడితే, ఆ తర్వాత ఆ భారీ మంచం, ఆ తర్వాత చువ్వలున్న కిటికీ, ఆ తర్వాత మెట్ల దగ్గరున్న గేట్ — ఇలా సాగుతుందన్నాడు.

"ఈ ప్రదేశం వల్ల నీకు మంచే జరుగుతోంది," అన్నాడు. "నిజంగా డియర్, ఒక్క మూడు నెలల భాగ్యానికి ఈ అద్దె ఇంటికి మార్పులు చేయడం అనవసరం కదా..."

"అయితే కనీసం కిందకి అయినా మారదాం. అక్కడ గదులు బాగున్నాయి," అన్నాను.

కానీ అతను మంచం గురించీ, కిటికీలూ వాటి గురించి చెప్పింది నిజమే.

ఎవరైనా కోరుకునేట్టుగా, గాలి ధారాళంగా వచ్చే సౌకర్యవంతమైన గది అది. నా పిచ్చికోరికలతో అతనిని ఇబ్బంది పెట్టడం సబబు కాదు.

కొద్దికొద్దిగా ఇప్పుడీ రూమ్ అంటే నాకు ఇష్టం ఏర్పడుతోంది– ఆ ఒక్క దరిద్రపుగొట్టు వాల్‌పేపర్ తప్పించి.

ఒక కిటికీలోనుంచి గార్డెన్ కనిపిస్తోంది. దట్టంగా ఉన్న పొదరిళ్లూ, పూలగుత్తులూ, పెద్ద పెద్ద చెట్లూ...

ఇంకో కిటికీలోనుంచి సముద్రమూ, ఓ చిన్న రేవూ కనిపిస్తూ చక్కటి దృశ్యం! ఇంటినుంచి అక్కడివరకూ దారి అంతా నీడలో ఉంటుంది! ఆ బాటల మీదా, పొదరిళ్ల చుట్టూ మనుషులు తిరుగుతున్నట్టు నాకు అనిపిస్తూంటుంది. అలాంటి భ్రాంతులని పొరపాటున కూడా దరికి చేరనివ్వవద్దని జాన్ హెచ్చరించాడు. నా ఊహాశక్తికీ, కథలు చెప్పగల కల్పనా చాతుర్యానికీ ఇలాంటి నెర్వస్ వీక్‌నెస్ తోడై రకరకాల భ్రాంతులకి దారితీయవచ్చనీ, మనసు స్థిరంగా ఉంచుకుని నిలబడాలనీ అన్నాడు. ప్రయత్నిస్తున్నాను.

ఒక్కోసారి అనిపిస్తుంది– నేను కొంచెం బాగుండి, కొంచెమైనా రాసుకోగలిగితే, నాకు ఒక విముక్తీ, విశ్రాంతీ దొరుకుతాయి గదా అని.

కానీ, ప్రయత్నించినపుడు చాలా అలిసిపోతున్నాను.

నా పనికి సంబంధించి ఎలాంటి సలహాలూ, తోడు లేకపోవడం నిరుత్సాహకరంగా ఉంటుంది. నేను కొంచెం బాగున్నప్పుడు కజిన్స్‌ని ఇక్కడికి పిలుద్దామంటాడు.

నాకు కొంచెం త్వరగా నయమైతే బాగుండు.

కానీ నేను దాని గురించి ఆలోచించకూడదు. నా మీద ఎలాంటి ప్రభావం చూపించగలదో ఈ పేపర్‌కి బాగా తెలిసినట్టుంది!

ఆ పేపర్‌లో ఒక చోట ఒక ఆకారం ఉంటుంది: ఒక మెడ విరిగిపోయి, పొడుచుకొచ్చే రెండు కళ్లు తలకిందులుగా నిన్ను చూస్తున్నట్టు.

నిర్లక్ష్యంగా ఉన్నట్టుండే ఆ ఆకారం అలా నిరంతరంగా కనిపిస్తూనే ఉండటం కోపం తెప్పిస్తుంది. కిందకీ, పైకీ, పక్కలకీ పాకుతూ, ఎక్కడ చూసినా ఆ రెప్పలార్చని కళ్లే. ఒకచోట, పేపర్ సమంగా అతికించని చోట, ఆ కళ్లు పైకీ కిందకీ పోతుంటాయి– ఒక కన్ను కంటే మరో కన్ను కొంత ఎత్తులో...

నిర్జీవమైన వస్తువులు అంతగా భావాన్ని వ్యక్తం చేయడం నేనెక్కడా చూడలేదు. ఒకప్పుడు చిన్నపిల్లగా ఉన్నప్పుడు ఇలానే పడుకుని – మిగతా పిల్లలు ఆటబొమ్మల షాపుల్లో భయపడుతూ ఆడుకునేదానికంటే ఎక్కువగా ఇంట్లోనే ఖాళీ గోడలూ, ఖాళీ ఫర్నిచరూ చూస్తూ వినోదాత్మకంగా భయపడేదాన్ని.

మా బీరువాకి ఉండే నాబ్స్ కన్నుకొడుతున్నట్టు ఉండేవి. ఒక కుర్చీ ఉండేది– తనని చూస్తే ఒక మంచి ఫ్రెండ్‌లాగా కనిపించేది.

ఇంకేవైనా వస్తువులు భయపెడుతున్నట్టు కనిపిస్తే, ఆ కుర్చీలోకి దూకి కూచుంటే ధైర్యంగా ఉండేది.

ఇక్కడ ఫర్నిచర్ కావలసినంత వరకే కిందనుంచి తెచ్చినందుకు కావొచ్చు – అంతా కంగాళీగా ఉంటుంది. బహుశా ఇది ఆడుకునే ప్రదేశంగా మార్చినప్పుడు పిల్లల బెడ్‌రూమ్‌లోని వస్తువులన్నీ బయటకి తరలించి

ఉంటారు. ఇక్కడ పిల్లలు చేసినన్ని ఘోరాలు నేనెక్కడా చూడలేదు.

ఇంతకుముందే చెప్పినట్టు– వాల్‌పేపర్‌ని ఎక్కడంటే అక్కడ పీకిపడేసారు. స్వంత సోదరుడి కంటే కూడా గట్టిగా అతుక్కుని ఉండే వాల్‌పేపర్‌ని అలా పీకేసారంటే వాళ్లకి ఓపిక ఎంత ఉందో, ద్వేషం కూడా అంతే ఉండి ఉండాలి.

ఇక నేల మీదంతా గీతలూ, చెక్కుళ్లూ, పగుళ్లూ. ఈ బరువైన మంచం ఒక్కటే మేము వచ్చేసరికి ఉన్నది. అది ఎన్నో మహాయుద్ధాలని భరించినట్టుగా కనిపిస్తుంది.

అవన్నీ నేను పట్టించుకోను. ఈ పేపరే...

జాన్ చెల్లెలు వస్తోంది. మంచి అమ్మాయి, నన్ను జాగ్రత్తగా చూసుకుంటుంది. నేను రాస్తున్నట్టు తనకి తెలియకూడదు.

తను ఉత్సాహంగా, పద్ధతిగా ఇల్లు నిర్వహించుకుంటూ ఉంటుంది. అంతకుమించిన మరో వ్యాపకం కోసం వెంపర్లాటలు లేవు. ఈ రాతలే నన్నిలా చేసాయని తను అనుకుంటూ ఉంటుందని నా గట్టి నమ్మకం!

కానీ తను లేనప్పుడు రాసుకుంటూనే ఉండొచ్చనుకోండి. తను వచ్చేది దూరం నుంచే కనిపెట్టవచ్చు.

వెలుతురు మారినప్పుడు ఈ వాల్‌పేపర్ డిజైన్ వెనక మరేదో ఆకృతి వేరే ఛాయలో ఉన్నట్టుంటుంది. మహా చిరాకేస్తుంది. ఆ ఫలానా వెలుతురులలోనే అది కనిపిస్తుంది– అదీ అస్పష్టంగా.

కానీ మాసిపోని చోట్ల– ఒక వింతైన, రెచ్చగొట్టే, అస్పష్టమైన ఆకారం, ముందున్న ఆ వెర్రి డిజైన్‌కి వెనకగా తచ్చాడుతున్నట్టు కనిపిస్తుంది.

అదిగో, జాన్ చెల్లెలు మెట్లమీదకి వచ్చేసింది!

★★★

మొత్తానికి జులై నాలుగు గడిచిపోయింది! వచ్చినవాళ్లందరూ వెళ్లిపోయారు, నేను మాత్రం పూర్తిగా అలిసిపోయాను. చుట్టూ ఎవరన్నా ఉంటే నాకు బాగుంటుంది కదా అని జాన్ అనుకున్నాడు. అమ్మ, నెల్లీ, పిల్లలు వచ్చి ఒక వారం ఉన్నారు.

నేనేమీ పనుల్లోకి దిగలేదనుకోండి. జెన్నీయే మొత్తం చూసుకుంటుంది.

అయినా, చాలా అలసట అనిపించింది.

నేను త్వరగా కోలుకోకపోతే, నన్ను డాక్టర్ వెయిర్ మిషెల్ దగ్గరకి పంపిస్తానని జాన్ అంటున్నాడు.

కానీ నాకు అక్కడికి వెళ్లాలని అస్సలు లేదు. ఆయన దగ్గర వైద్యం తీసుకున్న నా స్నేహితురాలు, ఆయన కూడా అచ్చం జాన్, నా అన్నయ్య లాంటి వాడేననీ, ఇంకా మాట్లాడితే ఇంకొంచెం ఎక్కువనీ అంది!

అదీగాక, అంత దూరం అదే పనిగా పోవాలి.

చెయ్యి కూడా కదల్చాలనిపించడం లేదు. పోను పోనూ చిరాకుగానూ, అసహనంగానూ ఉంది.

ఊరికే ఏడుపొస్తోంది. దాదాపు ఎప్పుడూ ఏడుస్తూనే ఉంటున్నాను.

జాన్‌గానీ, మరొకరు గానీ ఉన్నప్పుడు కాదనుకోండి. నేను ఒంటరిగా ఉన్నప్పుడే!

ఆ ఒంటరిగా ఉండటం అనేదే ఎక్కువగా జరుగుతోంది. సీరియస్ కేసుల వల్ల జాన్ టౌన్‌లోనే ఉండిపోవాల్సి వస్తోంది. జెన్నీ మంచిది కాబట్టి, కావాలంటే నాపాటికి నన్ను వదిలేస్తుంది.

అప్పుడు గార్డెన్‌లో కాసేపు నడుస్తాను. ఆ కాలిబాటల మీద కూడా. రోజా మొక్కల కింద కాసేపు కూర్చుని, అలా కాసేపు పడుకుంటాను.

ఆ వాల్‌పేపర్ ఉన్నప్పటికీ ఆ రూమ్ అంటే ఇష్టం పెరిగిపోతోంది. బహుశా, వాల్‌పేపర్ ఉందనే ఏమో.

అది బుర్రలో కూడా నివాసం ఏర్పరుచుకుంది!

ఇక్కడ నా మహా మంచం మీద పడుకుని (నేలకి మేకులతో బిగించి ఉంటుంది) ఆ వాల్‌పేపర్ డిజైన్‌ని చూడటం మొదలుపెడతాను. వ్యాయామం చేసినంత పని అనుకోండి. ముందు కిందనుంచి ఒక మూలలో – ఎవరూ తాకని చోటు నుంచి – మొదలుపెడతాను. అలా అర్థంలేని ఆ ఆకారాలనన్నింటినుంచీ ఏదో విషయం రాబట్టగలనని ఏ వెయ్యోసారో అనుకుంటాను.

నాక్కొంచెం డిజైన్ సూత్రాలు తెలుసు. ఆ సూత్రాల్లో దేనికీ కట్టుబడి ఆ డిజైన్ లేదని మాత్రం చెప్పగలను.

వెడల్పులని అనుసరించి అదే డిజైన్ పునరావృతమయింది.

అవి క్షితిజసమాంతరంగా, అడ్డంగా కూడా ఉంటాయి. అలా అనిపిస్తాయి. ఆ వరసని అనుసరించేసరికి నీరసం వచ్చేస్తుంది.

వీటన్నిటినీ ఓపిగ్గా పరిశీలిస్తూ అనుసరించాక దస్సిపోయినట్టుగా ఉంటుంది. కాసేపు పడుకుంటాను.

★★★

అసలు ఇదంతా ఎందుకు రాయాలో నాకు అర్థం కావడం లేదు.

రాయాలని లేదు.

రాయగల శక్తీ లేదు.

ఇలా చెప్తే జాన్ కొట్టిపారేస్తాడు. నేను అనుభవిస్తున్నదీ, ఆలోచిస్తున్నదీ ఏదో రూపంలో చెప్పి తీరాలి. అది గొప్ప ఊరట!

కానీ, పొందే ఊరట కంటే చేస్తున్న ప్రయత్నమే ఎక్కువవుతోంది.

ఈమధ్య చాలా సమయం పాటు బద్ధకంగా అనిపించి అలా పడుకుని ఉంటున్నాను.

అలా నీరసించి పోకూడదంటాడు జాన్. కాడ్ లివర్ ఆయిల్, చాలా టానిక్కులూ, ఇంకా ఏవేవో ఇస్తాడు.

పాపం జాన్‌కి నేనంటే చాలా ఇష్టం. ఇలా నేనుండటం అస్సలు సహించలేడు. మొన్నో రోజున అతనితో నిజాయితీగా, లాజికల్‌గా మాట్లాడి, అలా నేను వెళ్లి ఓసారి కజిన్స్‌ని కలిసిరావడాన్ని అతను ఒప్పుకుంటే బాగుంటుందని చెప్పాను.

కానీ అతను– నేను వెళ్లలేననీ, వెళ్లినా అక్కడ ఉండలేననీ అన్నాడు. నేనింకేమీ మాట్లాడలేకపోయాను. ఎందుకంటే, నేను మొదలుపెట్టింది పూర్తయేలోపలే ఏడవడం ప్రారంభించాను కాబట్టి.

అసలు సూటిగా ఆలోచించడం కూడా కష్టమైపోతోంది నాకు. ఈ నెర్వస్ వీక్‌నెస్ కారణంగా.

జాన్ నన్ను తన చేతుల్లోకి తీసుకొని, పైకి దాదాపు మోసుకెళ్లినంత పని చేసి, మంచం మీద పడుకోబెట్టాడు. నా పక్కన కూచుని, నాకు అలసట అనిపించేంత వరకూ ఏదో పుస్తకం చదివి వినిపించాడు.

నేను తనకి అత్యంత ఇష్టమైన వ్యక్తిననీ, తన సుఖమూ సర్వమూ నేనేననీ, తనగురించైనా నేను జాగ్రత్తగా ఉండి త్వరగా కోలుకోవాలనీ అన్నాడు.

నేను తప్ప మరెవ్వరూ ఈ పరిస్థితిలోనుంచి నన్ను బయటపడెయ్యలేరనీ, దానికోసం నేను మనసు స్థిరంగా ఉంచుకుని, కాస్త నిగ్రహంతో ఎలాంటి పిచ్చి ఆలోచనలూ దగ్గరకి రానివ్వకూడదని అన్నాడు.

చిన్నపిల్లవాడు ఆరోగ్యంగా, సంతోషంగా ఉన్నాడు– అదో ఊరట. ఇక్కడ ఈ దారుణమైన వాల్‌పేపర్ మధ్య నాతో గడపాల్సిన పరిస్థితి లేదు, నయం.

ఈ రూమ్‌లో మేము లేకపోయినట్టయితే, ఇక్కడ వాడుండేవాడు. అదృష్టవంతుడు! నా పిల్లవాడిని ఆరు నూరయినా ఇలాంటి రూమ్‌లో పడుకోనిచ్చేదాన్ని కాను.

ఇంతకుముందు అనిపించలేదు కానీ, నన్ను ఈ రూమ్‌లో ఉంచి మంచిపని చేసాడు జాన్. చిన్నపిల్లవాడి కంటే నేనే దీన్ని భరించడం తేలిక.

అలా అని ఇవన్నీ వాళ్లతో మాట్లాడననుకోండి. ఆ మాత్రం తెలివితేటలున్నాయి నాకు– అన్నింటినీ గమనిస్తూ ఉంటాను.

ఆ వాల్‌పేపర్‌లో నాకు తప్ప ఎవ్వరికీ తెలియని, ఎప్పటికీ తెలుసుకోలేని విషయాలు ఉన్నాయి.

బయట ఉన్న డిజైన్‌కి వెనకగా ఉన్న అస్పష్టమైన ఆకారాలు రోజురోజుకీ స్పష్టమవుతున్నాయి.

ఆకారం షేప్ అదే. కానీ చాలా ఆకారాలు.

ఆ ముందు ఉన్న డిజైన్ వెనకగా ఒక స్త్రీ వంగి, పాకుతున్నట్టుగా అనిపిస్తోంది. అది నాకు కొంచెం కూడా నచ్చలేదు. ఆలోచించడం మొదలుపెట్టాను– ఇక్కడినుంచి జాన్ నన్ను తీసుకొని వెళ్లిపోతే బాగుండు!

★★★

నా కేస్ గురించి జాన్‌తో మాట్లాడటం చాలా కష్టం. చాలా తెలివితేటలున్నవాడు కాబట్టీ, నన్ను చాలా ప్రేమిస్తాడు కాబట్టీ.

అయినా సరే అని నిన్న రాత్రి ప్రయత్నించాను.

వెన్నెల రాత్రి. చంద్రుడు అన్నివైపులా వెలుగు పంచుతున్నాడు, సూర్యుడి లాగే.

ఒక్కోసారి చూడాలంటే రోతగా ఉంటుంది. నెమ్మదిగా పాకుతూ, ఈ కిటికీనుంచో ఇంకో కిటికీనుంచో వస్తూ ఉంటుంది.

జాన్ నిద్రపోతున్నాడు. లేపాలనిపించలేదు. అలానే కదలకుండా పడుకుని, వాల్‌పేపర్ మీద పడుతున్న వెన్నెల కిరణాలని చూస్తున్నాను– ఒళ్లు జలదరించే ఆ క్షణం వరకూ.

వాల్‌పేపర్‌లో వెనక భాగాన ఉన్న అస్పష్టపు ఆకారం, తన ముందున్న డిజైన్‌ని కుదుపుతోంది– తను బయటకి రావాలనుకుంటున్నట్టుగా.

నెమ్మదిగా లేచి అసలు నిజంగా వాల్‌పేపర్ కదిలిందా అని పరిశీలించడానికి వెళ్లాను. వెనక్కి వచ్చేసరికి జాన్ మేలుకుని ఉన్నాడు.

"ఏంటి చిన్నారీ? అలా లేచి తిరగకు. జలుబు పట్టుకుంటుంది," అన్నాడు.

మాట్లాడటానికి ఇదే సమయం అనుకున్నాను. ఇక్కడ ఉండటం వల్ల నాకు ప్రత్యేకంగా ఏమీ లాభించడం లేదనీ, అతను నన్ను తీసుకువెళ్లిపోవాలనీ అన్నాను.

"ఎందుకు, డార్లింగ్? మన లీజ్ ఇంకో మూడు వారాల్లో అయిపోతుంది. ముందే ఎలా వెళతాం?" అన్నాడు. "అక్కడ మన ఇంటికి ఇంకా రిపేర్లు పూర్తికాలేదు. ఇప్పుడు ఇక్కడనుంచి వెళ్లే పరిస్థితి కూడా లేదు. నీకు ఏదైనా ప్రమాదకరమైన పరిస్థితి అంటే, అది వేరే విషయం. కానీ, నీకు తెలుస్తోందో లేదో– నువ్వు బాగవుతున్నావు డియర్! నేను డాక్టర్ని, నాకు తెలుసు. నీ ఒంటికి కాస్త కండ పడుతోంది, ఆకలీ అదీ కూడా మెరుగైంది. ఇప్పుడు నీ గురించి ఆలోచిస్తే కాస్త తేలిగ్గా ఉంది నాకు."

"నా బరువు కొంచెం కూడా పెరగలేదు– లేదూ, పెరగాల్సినంతగా పెరగలేదు. నా ఆకలి సాయంత్రాలు నువ్వున్నప్పుడు బానే వుంటుందేమో కానీ, పొద్దుటి పూట నువ్వెళ్లిపోయాక అస్సలుండదు," అన్నాను.

"ఎంత అల్లరో చూడు, తను ఎంతంటే అంతే," అన్నాడు గట్టిగా కౌగలించుకొని. "ఇప్పుడు హాయిగా ఉన్నప్పుడు పడుకుని, రేప్పొద్దున మాట్లాడుకుందాం, రా!"

"నువ్వు వెళ్లిపోవు కదా మరి?" అని అడిగాను కాస్త నిరాశగా.

"ఎలా వెళ్తాను, డియర్? ఇంకో మూడు వారాలేగా? అయిపోయాక, మనం చక్కగా ఒక ట్రిప్ మీద వెళదాం. ఈ లోపల జెన్నీ మన ఇల్లు రడీ చేస్తుంది. నన్ను నమ్ము డియర్, నువ్వు నిజంగా మెరుగవుతున్నావు."

"బహుశా శారీరకంగా మాత్రమేనేమో–" అని మొదలుపెట్టి ఆపేసాను. తను లేచికూచుని నావైపు

తీవ్రంగా, మందలిస్తున్నట్టు చూసేసరికి ఇంకొక్క మాట మాట్లాడలేకపోయాను.

"డార్లింగ్! దయచేసి నాకోసం, మన పిల్లవాడి కోసం, నీకోసం కూడా– అలాంటి ఆలోచనలని మనసులోకి రానివ్వవద్దు. నువ్వున్న పరిస్థితిలో అలాంటి ఆలోచనలు ప్రమాదకరం. తప్పు కూడా. నేను డాక్టర్ని, నేను చెబితే కూడా నమ్మవా?" అన్నాడు.

సో, ఆ విధంగా ఇక దానిగురించి మరేమీ అనలేకపోయాను. వెంటనే పడుకున్నాం. నేను నిద్రపోయానని అనుకున్నాడు, కానీ లేదు. అలా పడుకొని కొన్ని గంటల పాటు ఆలోచిస్తూ ఉన్నాను. ఆ ముందు డిజైన్, వెనకాల ఉన్న ఆకారం ఒకేసారి కదిలాయా, లేక విడివిడిగా కదిలాయా అని.

★★★

వెలుతురు ఉన్నప్పుడు, ఇలాంటి ఆకృతులకి ఒక క్రమత ఉండదు, మామూలు సూత్రాలని పాటిస్తున్నట్టు ఉండవు. మామూలుగా ఆలోచించే బుర్రలకి చిరాకు పుట్టిస్తాయి.

సరే– ఆ రంగు దరిద్రంగానూ, అస్పష్టంగానూ, అన్నింటినీ మించి కోపం తెప్పించేటట్టుగానూ ఉంది. కానీ ఆ ఆకృతి మాత్రం చిత్రహింస పెడుతోంది.

అది అర్థం అవుతూ అవుతూ– ఇదిగో, అర్థం అయిపోయిందీ అన్నట్టుంటుంది. దాంట్లో మునిగిపోయి దాన్నే అనుసరిస్తూ ఉన్నప్పుడు తలకిందులుగా ఎగిరి మొహం మీద చరిచినట్టుంటుంది. కిందకి తోసేసి నీ మీదకి ఎక్కి వీరవిహారం చేస్తున్నట్టుంటుంది. అంతా ఒక పీడకలలో లాగా.

బయటి ఆకారం ఫంగస్ లాగా క్లిష్టమైన నిర్మాణం ఉన్న డిజైన్. ఒక పుట్టగొడుగుని ఇంకోదానితో ముడివేయడం మీరు ఊహించగలిగితే, అనేక పుట్టగొడుగుల సమాహారపు చిక్కుముళ్ల నిర్మాణం లాంటిది అది.

ఒక్కోసారి అలా ఉంటుంది.

ఎవ్వరూ గమనించని వింతవిషయం ఒకటి ఈ పేపర్లో ఉంది. మారే వెలుతురుతో బాటు ఇది కూడా మారుతూ ఉంటుంది.

తూరుపు కిటికీనుంచి సూర్యకిరణాలు ప్రజ్వలంగా వచ్చినప్పుడు — పొద్దుగ్గా సూటిగా ఉండే ఆ మొదటి కిరణం కోసం చూస్తూ ఉంటాను — పేపర్ ఒక్కసారిగా ఎలా మారిపోతుందంటే, అస్సలు నమ్మలేను.

అందుకే ఎప్పుడూ దాన్ని చూస్తుంటాను.

వెన్నెల వచ్చేటప్పటికి — చంద్రుడు ఉన్నంతసేపూ వెన్నెల లోపలికి పడుతూనే ఉంటుంది — ఈ పేపర్ ఆ పేపరేనా అనిపిస్తుంది.

రాత్రయ్యే సరికి, ఏ లైట్‌లో అయినా సరే — సంధ్య కాంతి గానీ, కొవ్వొత్తి వెలుతురు కానీ, దీపపు వెలుతురు కానీ, అన్నిటినీ మించి ఇహ వెన్నెల వెలుతురులో అది జైలు కటకటాలుగా మారుతుంది! నా ఉద్దేశం ఆ బయటి డిజైన్.

వెనకాల ఉన్న స్త్రీ అప్పుడు స్పష్టంగా కనిపిస్తుంది.

నాకు చాలా రోజులు ఆ వెనకాల ఉన్న మరో ఆకృతి ఏమిటో అర్థమయ్యేది కాదు. అది ఒక స్త్రీ అని ఇప్పుడు కచ్చితంగా చెప్పగలను.

పగటి వెలుతురులో ఆ స్త్రీ తగ్గిపోయి, నిశ్శబ్దంగా ఉండిపోయేది. ఆ డిజైనే ఆ నిశ్చలతకి కారణమేమో అనిపిస్తుంది. ఏమైనా, ఆలోచిస్తే గందరగోళంగా ఉంటుంది. ఆలోచిస్తూ, నేను మౌనంలో పడిపోతుంటాను.

ఇప్పుడు చాలాసేపు పడుకుని ఉంటున్నాను. అదీ మంచిదే, వీలైనంత నిద్ర పో అని అంటాడు జాన్.

నిజానికి భోజనం అయ్యాక ఓ గంట పడుకోబెట్టే అలవాటుని జానే చేసాడు.

అది ఓ దురలవాటని నా నమ్మకం. ఎందుకంటే, నేను నిద్రపోను కాబట్టి.

ఇదంతా ద్రోహం. నేను మెలకువగానే ఉంటానని వాళ్లకి చెప్పను కాబట్టి. బాబోయ్!

అసలు నిజం ఏమిటంటే, ఈమధ్య జాన్‌ని చూస్తుంటే కొంచెం భయం వేస్తోంది.

ఒక్కోసారి అతను వింతగా ఉంటాడు. జెన్నీ కళ్లల్లో కూడా ఒక అర్థం కాని చూపు ఏదో ఉంటుంది.

ఆ పేపరే వీటన్నిటికీ కారణమని ఒక్కోసారి అనిపిస్తుంది.

తనని చూస్తున్నానని జాన్ గమనించనప్పుడు అతన్ని గమనిస్తుంటే, జాన్ ఆ పేపర్ వైపు చూస్తూ దొరికిపోయేవాడు! జెన్నీ కూడా. జెన్నీ ఆ పేపర్‌ని తడిమి చూస్తూ ఒకసారి దొరికిపోయింది.

జెన్నీకి అప్పుడు నేను రూమ్‌లోనే ఉన్నానని తెలియదు. ఏం చేస్తున్నావని శాంతంగా, ప్రశాంతమైన గొంతుతో, గంభీరంగా అడిగేసరికి ఏదో దొంగతనం చేస్తూ దొరికిపోయినదానిలాగా గిరుక్కున వెనక్కి తిరిగి నావైపు కోపంగా చూసింది. ఎందుకు అలా జడిపిస్తావని అడిగింది.

ఆ పేపర్‌ని అంటుకుంటే మరకలు పడుతున్నాయనీ, జాన్ బట్టల మీదా నా బట్టల మీద అలాంటి పసుపుపచ్చని మరకలు ఉన్నాయనీ, జాగ్రత్తగా ఉండమనీ చెప్పింది.

చాలా అమాయకంగా చెప్పినట్టు లేదూ? ఆ ఆకారాన్ని పరిశీలిస్తోందని నాకు తెలుసు. అది నాకు తప్పితే మరెవ్వరికీ కనిపించదనీ నాకు నిశ్చయంగా తెలుసు!

★★★

మునుపటి కంటే జీవితం ఇప్పుడు మరింత ఉత్సాహకరంగా ఉంది. ఇప్పుడు చూడండి– ఎదురుచూడటానికీ, పరిశీలించడానికీ, ఏదైనా కనిపెట్టడానికి ఏదో ఒకటి ఉంది. ఇప్పుడు బాగా తింటున్నాను. ముందుకన్నా ప్రశాంతంగా ఉంటున్నాను.

నాలో ఈ మార్పు చూసి జాన్ సంతోషించాడు! వాల్‌పేపర్ ఉన్నప్పటికీ నేను బాగానే మెరుగవుతున్నట్టున్నానే అని మొన్నొకరోజున పెద్దగా నవ్వాడు.

నేనూ నవ్వి ఊరుకున్నాను. వాల్‌పేపర్ వల్లనేఅని అతనికి చెప్పే ఉద్దేశం లేదు– ఆట పట్టిస్తాడు. నన్ను తీసుకుని వెళ్లిపోయినా వెళ్లిపోవచ్చు.

ఇదేదో కనిపెట్టే వరకూ వెళ్లడం నాకిష్టం లేదు. ఇంకో వారం ఉంది, అది సరిపోతుందనుకుంటాను.

★★★

ఇప్పుడు చాలా బాగుంది! పరిణామాలని గమనించడం కోసం రాత్రిళ్లు పెద్దగా నిద్రపోవడం లేదు. పగళ్లు మాత్రం బాగా నిద్రపోతున్నాను.

పగలు అది గజిబిజిగా ఉండి అలసట కలగజేస్తోంది.

ఆ ఫంగస్ మీద కొత్త పుట్టగొడుగులు పుట్టుకొస్తూనే ఉన్నాయి. వాటిమీద వివిధ పసుపు వర్ణాలు. ఎంత ప్రయత్నించినా, అవి ఎన్నీ అని లెక్కపెట్టడం అసాధ్యంగా మారింది.

ఆ వాల్‌పేపర్‌ది మాత్రం వింతైన పసుపురంగు! నేను ఇప్పటివరకూ చూసిన పసుపురంగు వస్తువులని జ్ఞప్తికి తెచ్చేలా ఉంటుంది ఆ రంగు. మంచివి కాదు – పాత, పిచ్చి పసుపురంగు వస్తువులు.

ఆ పేపర్‌కి సంబంధించి మరో విషయం కూడా ఉంది– వాసన! ఈ గదిలోకి అడుగుపెట్టిన మొదటిరోజునే ఆ వాసనని గమనించాను కానీ, గాలీవెలుతురుల మధ్య అది భరించలేనట్టుగా అయితే లేదు. ఈ వారం రోజులుగా మంచు, వర్షాల వల్ల, కిటికీలు తెరిచి ఉంచినా మూసి ఉంచినా, వాసన మాత్రం అలానే ఉంది.

ఆ వాసన ఇల్లంతా పాకుతున్నట్టు ఉంటుంది.

డైనింగ్ రూమ్ అంతా ఆవరించుకుని ఉన్నట్టుంటుంది. హాల్లో దాక్కుని ఉన్నట్టూ, మెట్ల మీద పొంచివుండి వేచిచూస్తున్నట్టూ ఉంటుంది.

నా జుట్టులోకి ప్రవేశిస్తుంది.

బయటికి ఎప్పుడైనా వెళ్లినప్పుడు కూడా, హఠాత్తుగా తలతిప్పి దాన్ని ఆశ్చర్యపరుద్దామని చూస్తానా — అక్కడ కూడా ఆ వాసన ఉంటుంది!

చాలా వింతైన వాసన కూడా! దాన్ని విశ్లేషించి అది ఏ వాసనలాగా ఉంటుందా అని కనిపెట్టడానికి గంటల కొద్దీ సమయం వెచ్చించాను.

అది పిచ్చి వాసన కాదు, మెత్తగా ఉంటుంది. సున్నితంగా అలా అలుముకునే ఉంటుంది.

ఈ రొచ్చు వాతావరణంలో మాత్రం భరింపశక్యం కాదు. రాత్రి మెలకువ వచ్చినప్పుడు నామీద వేళ్లాడుతూ ఉంటుంది.

మొదట్లో ఈ వాసన నన్ను చాలా డిస్టర్బ్ చేసేది. ఇల్లు అసలు తగలబెట్టేద్దామా అన్న ఆలోచన కూడా వచ్చింది.

కానీ ఇప్పుడు అలవాటై పోయింది. అది ఎలా ఉంటుందో అర్థం చేసుకోవడానికి ఏకైక మార్గం ఆ పేపర్ కలర్! ఒక పసుపుపచ్చని వాసన!

ఈ గోడ కిందవైపున, ఫ్లోర్ తుడిచే భాగానికి దగ్గరగా ఒక తమాషా మరక ఉంటుంది. ఆ మరక అలా రూమ్‌లోని గోడల మీదంతా పరుచుకుని ఉంటుంది గుండ్రంగా. ప్రతి ఫర్నిచర్ వెనకాలా — మంచం తప్పించి — కనిపిస్తూ ఉంటుంది. పొడుగ్గా, స్ట్రెయిట్‌గా, ఎవరో దాన్ని మళ్లీ మళ్లీ రుద్దినట్టుగా ఉంటుంది.

అది ఎలా వచ్చిందో, ఎవరు చేసారో, అసలు ఎందుకు చేసారో అని ఆశ్చర్యం వేస్తుంటుంది. గుండ్రంగా, గుండ్రంగా, గుండ్రంగా, గుండ్రంగా, గుండ్రంగా — కళ్లు తిరుగుతున్నాయి!

★★★

మొత్తానికి ఒకటి కనుక్కున్నాను చివరికి.

రాత్రిళ్లు తదేకంగా పరిశీలించడం ద్వారా అది ఎప్పుడు మారుతోందో కనిపెట్టేసాను.

ముందున్న డిజైన్ *నిజంగానే* కదులుతోంది– అందులో ఆశ్చర్యం లేదు. ఎందుకంటే వెనక ఉన్న స్త్రీ దాన్ని కుదుపుతోంది కాబట్టి!

ఒక్కోసారి అసలు అక్కడ చాలామంది స్త్రీలు ఉన్నారా అనిపిస్తుంది. ఒక్కోసారి ఒక్కరే అనిపిస్తుంది. తను ఆ ప్రదేశం అంతా విపరీతమైన వేగంతో పాకుతూ ఉంటుంది. ఆ పాకడం వల్ల అక్కడంతా కుదిపి కదిపినట్టవుతుంది.

బ్రైట్‌గా ఉన్న ప్రదేశాల్లో ఆమె నిశ్చలంగా ఉంటుంది. రంగు మాసిన ప్రదేశాల్లో ముందున్న కటకటాలు పట్టుకుని వాటిని బలంగా ఊపుతూ ఉంటుంది.

వాటిని దాటుకుని రావడానికి సదా ప్రయత్నిస్తూ ఉంటుంది. కానీ ఎవ్వరూ ఆ డిజైన్‌ని దాటుకుని రాలేరు. గొంతు పిసికేసినట్టవుతుంది. బహుశా అందుకే అన్ని తలలు ఉన్నాయేమో!

దాటుకుని రావాలని చూసారో, ఆ గొడుగుల సంక్లిష్ట నిర్మాణం ఊపిరాడనివ్వకుండా చేసి, తలకిందులుగా వేళ్లాడదీసిందా, కళ్లు తెల్లగా అయిపోతాయి!

ఆ తలలు లేకపోయినా, లేకపోతే కనిపించకపోయినా ఇంత ఘోరంగా ఉండేది కాదు.

★★★

ఆ స్త్రీ పగటిపూట బయటకి వస్తుందనుకుంటాను.

ఎందుకో కూడా చెబుతాను — రహస్యం! — నేను ఆమెని చూసాను!

ఏ కిటికీలోనుంచి చూసినా ఆమె కనిపిస్తూ ఉంటుంది!

అది ఆమే, నాకు తెలుసు. ఎందుకంటే ఆమె పాకుతూ ఉంటుంది. పగటిపూట ఆడవాళ్లెవ్వరూ అలా పాకరు.

నీడ కమ్మిన ఆ కాలిబాటల మీద అటూ ఇటూ పాకటం చూస్తాను. పొదరిళ్ల దగ్గరా, గార్డెన్ అంతా పాకుతూ ఉండటం చూస్తాను.

రోడ్ల మీద చెట్ల కిందగా అలా పాకుతూ పోవడం చూస్తాను. ఏ వాహనమో వస్తే, ఏ బ్లాక్‌బెర్రీ వెనకాలో దాక్కోవడం కూడా చూస్తాను.

ఆమెనేమీ తప్పుపట్టలేను. అలా పగటి వేళల్లో పాకుతూ కనిపించడం బాగుండదు కదా!

పగటిపూట నేను అలా పాకుతూ ఉన్నప్పుడు తలుపు వేసేసుకుంటాను. రాత్రిళ్లు అలా చేయలేను, ఎందుకంటే జాన్ ఏదో ఒకటి అనుమానిస్తాడు.

జాన్ ఇప్పుడు మరీ వింతగా తయారయ్యాడు. అతన్ని చిరాకుపెట్టదలచుకోలేదు. అతను ఇంకో రూమ్ తీసుకుంటే బాగుణ్ణు! అదీకాకుండా, ఆమె రాత్రిళ్లు బయటికి వచ్చినప్పుడు వేరే ఎవరైనా చూడటం నాకిష్టం లేదు.

అన్ని కిటికీలలోనుంచీ ఒకేసారి ఆమెని ఎలాగైనా చూడగలనా అనుకుంటాను.

ఒక కిటికీ నుంచి ఇంకో కిటికీకి ఎంత వేగంగా వచ్చినా సరే– ఒక్క కిటికీలోనుంచి మాత్రమే చూడగలుగుతున్నాను.

నేను కిటికీ మారడం కంటే వేగంగా ఆమె పాకగలదనుకుంటాను.

వేగంగా వీచే గాలులకి ఇంకా వేగంగా కదిలిపోయే మేఘపు నీడల్లాగా దూరంగా అలా ఊరి పరిసరాల్లో కూడా ఆమె అలా పాకుకుంటూ పోవడం కూడా చూస్తుంటాను.

★★★

వెనకున్న ఆకృతికి ముందున్న దాన్ని తీస్తేస్తే...? కొంచెం కొంచెం ప్రయత్నించాలి.

అన్నట్టు, నేను ఇంకోటి కూడా కనిపెట్టాను. కానీ, అదేంటో ఈసారి చెప్పను. మనుషుల్ని కూడా అతిగా నమ్మలేం.

ఇంకో రెండు రోజులు మాత్రం మిగిలాయి. జాన్ ఏదో గమనిస్తున్నాడు. అతని చూపులు నాకు నచ్చడం లేదు.

నా గురించి జెన్నీకి ఏవో వైద్యపరిభాషలో ప్రశ్నలు వేస్తున్నాడు. ఇవ్వడానికి ఆవిడ దగ్గర మంచి రిపోర్టే ఉంది.

నేను పగళ్లు చాలా నిద్రపోతానంది.

రాత్రిళ్లు నేను సరీగ్గా నిద్రపోనని జాన్‌కి తెలుసు– ఎంత కదలకుండా పడుకున్నా.

నన్నూ చాలా ప్రశ్నలడిగాడు — ప్రేమనీ దయనీ నటిస్తూ.

ఏదో– అవన్నీ నేను కనిపెట్టలేనట్టు!

ఈ పేపర్‌తో మూడు నెలలు కలిసి బతికాక, అతనలా ఉండటంలో ఆశ్చర్యం లేదు.

మాటవరసకి అంటున్నాను కానీ– జాన్, జెన్నీ ఆ పేపర్ కారణంగా రహస్యంగా ప్రభావితమయ్యారని నాకు కచ్చితంగా తెలుసు.

★★★

హుర్రా! ఇవాళ ఆఖరి రోజు– ఇది చాలు. రాత్రి జాన్ టౌన్‌లో ఉండిపోయాడు, ఇవాళ సాయంత్రం దాకా రాడు.

జెన్నీ నాదగ్గర పడుకుందామని చూసింది తెలివిగా. ఒక్క రాత్రన్నా ఒంటరిగా పడుకుంటే కొంచెం హాయిగా ఉంటుందని ఆమెకి చెప్పేసాను.

నేనూ చాలా తెలివిగా చేసాను– ఎందుకంటే, నేను అసలు ఒంటరిగా లేనుగా! కొంచెం వెన్నెల వచ్చిందో లేదో, పాపం ఆమె పాకుతూ ఆ ముందు ఆకారాన్ని కుదపడం ప్రారంభించింది. నేను లేచి తనదగ్గరకి పరిగెత్తాను సహాయం చేద్దామమని.

నేను లాగుతున్నాను, తను కుదుపుతోంది. నేను కుదుపుతున్నాను, తను లాగుతోంది. తెల్లారేసరికి, ఇద్దరం గజాల కొద్దీ ఆ పేపర్‌ని పీకేసాం.

నా ఎత్తుకి కొంచెం పైవరకూ ఉన్న భాగమంతా, రూమ్ చుట్టూ సగభాగం.

సూర్యుడు రాగానే ఆ డిజైన్ నన్ను చూసి పగలబడి నవ్వడం ప్రారంభించింది. ఇవాళ పూర్తిచేసేస్తానని ప్రకటించేసాను.

మేము రేపు బయల్దేరి వెళ్లిపోతాం. ఇక్కడి నా ఫర్నిచర్ అంతా కిందకి షిఫ్ట్ చేస్తున్నారు– ఇంతకుముందు ఈ రూమ్ ఎలా ఉందో అలా ఉంచేయడానికి.

జెన్నీ ఆశ్చర్యంతో ఆ గోడవైపు చూసింది. దాని క్రూరత్వం మీద అసహ్యంతో నేనే అలా చేసానని సరదాగా చెప్పాను.

తను నవ్వేసి, తనైనా అదే చేస్తానని చెబుతూనే, నేను అలసిపోకూడదు అంది.

ఎంత ఆత్మవంచన చేసుకుంటోంది!

ఇక్కడ నేను ఉన్నాను. నేను తప్పించి ఏ మనిషీ దాన్ని తాకడానికి వీల్లేదు– *బతికి ఉండదలచుకుంటే!*

రూమ్ నుంచి నన్ను బయటికి తీసుకువెళదామని ప్రయత్నించింది. నేను మాత్రం, ఇక్కడే ఖాళీగా హాయిగా ఉందనీ, ఇక్కడే వీలైనంతసేపు పడుకుంటాననీ, రాత్రి భోజనానికని కూడా లేపవద్దనీ, లేచాక నేనే పిలుస్తాననీ చెప్పాను.

తను వెళ్లిపోయింది, పనివాళ్లు కూడా వెళ్లిపోయారు, ఇక్కడున్న సామానంతా వెళ్లిపోయింది. ఇక ఇక్కడ నేలకి బిగించిన ఆ మంచమూ, దానిమీద పరుపూ తప్పించి ఇంకేమీ లేవు.

ఇవాళ రాత్రికి కింద పడుకుని, రేపు పడవలో ఇంటికి ప్రయాణం.

ఈ రూమ్ ఇప్పుడు హాయిగా ఉంది. ఖాళీగా ఉంది మళ్లీ.

పిల్లలు ఎట్లా చించేసారు!

ఇక పని ప్రారంభించాలి.

రూమ్ తలుపు లాక్ చేసేసి, తాళం చెవిని కింద ఫ్రంట్ ఏరియాలోకి విసిరేసాను.

జాన్ వచ్చేవరకూ నేను బయటకి వెళ్లను, లోపలికి ఎవరినీ రానివ్వను.

జాన్‌కి ఆశ్చర్యం కలిగించాలి.

ఇక్కడో తాడు ఉంది, జెన్నీ కూడా గమనించలేదు. ఆ స్త్రీ బయటకి వస్తే, బయటకి వెళ్లాలనుకుంటే, తనని కట్టిపారేయగలను!

కానీ నేను మర్చిపోయింది ఒకటుంది. దేనిమీదైనా ఎక్కి నిలుచుంటే తప్ప ఎక్కువ ఎత్తుకి నేను చేరుకోలేను.

బెడ్‌నేమో కదల్చలేం!

దాన్ని కొంచెం ఎత్తి, నెట్టాలని నా శక్తిమేరకు ప్రయత్నించాను. చివరికి కోపం వచ్చి ఆ మంచం చివరలో ఒక ముక్కని కొరికాను. పళ్లు నెప్పెట్టాయి.

నేలమీదనే నిలుచుని, అందినంత మేరకు పేపర్‌ని పీకేసాను. అది చాలా గట్టిగా అతుక్కుని ఉంది, ఆ ఆకారం ఇదంతా చూసి వినోదిస్తోంది. వేలాడే తలలూ, పొడుచుకొచ్చిన కళ్లూ, చిన్నచిన్న అడుగులతో నడిచే ఫంగస్సూ అన్నీ వికృతంగా అరుస్తున్నాయి.

కోపంతో నాకు ఏదో ఒకటి చేయాలనిపిస్తోంది. కిటికీలో నుంచి దూకడం చేయవచ్చు కానీ, ఆ ఊచలేమో చాలా గట్టిగా ఉన్నాయి.

అంతేకాదు, అసలు నేను ఆ పని చేయను. అలాంటి పని చేయడం సరికాదనీ, దాన్ని అపార్థం చేసుకుంటారనీ నాకు బాగానే తెలుసు.

కిటికీలో నుంచి బయటకి చూడాలని కూడా లేదు. కింద పాకుతూ ఉన్న ఆడవాళ్లు చాలామంది ఉన్నారు, అందరూ చాలా వేగంగా పాకుతూ ఉన్నారు.

అసలు వాళ్లందరూ ఈ వాల్‌పేపర్ నుంచే బయటకి వచ్చారా, నేను వచ్చినట్టు?

ఇదిగో ఇక్కడ నా తాడుతో నేను కట్టేసుకొని సేఫ్‌గా ఉన్నాను– మీరు నన్ను రోడ్డు మీదకి లాక్కెళ్లలేరు!

రాత్రయ్యేటప్పటికి నేను ఆ బయటి డిజైన్ వెనకకి వెళ్లిపోవాలి. కానీ చాలా కష్టమే!

ఇక్కడ ఈ పెద్ద రూమ్‌లో ఉంటూ, హాయిగా నా ఇష్టం వచ్చినట్టు పాక్కుంటూ ఉంటే ఎంత హాయిగా ఉందో!

బయటికి వెళ్లాలని లేదు నాకు. జెన్నీ పిలిచినా సరే.

బయటికి వెళ్లి గ్రౌండ్ మీద పాకాలంటే అదంతా ఆకుపచ్చగా ఉంటుంది, ఇలా పసుపుపచ్చగా ఉండదు.

ఇక్కడ నేలమీద స్మూత్‌గా పాకవచ్చు. గోడమీద మరక చక్కగా నా భుజాల ఎత్తువరకూ ఉంది కాబట్టి, దారి తప్పిపోవడం అనేది జరగదు.

అదిగో, జాన్ వచ్చినట్టున్నాడు తలుపు దగ్గరకి!

లాభం లేదు అబ్బాయ్! నువ్వు దాన్ని తెరవలేవు!

ఎట్లా పిలుస్తూ తలుపు బాదుతున్నాడో!

ఇప్పుడు ఓ గొడ్డలి కోసం అరుస్తున్నాడు.

అంత అందమైన తలుపుని పగలగొట్టడం అమానుషం!

"జాన్ డార్లింగ్, తాళం చెవి కింద మెట్లమీద అరిటాకు కింద ఉంది!" అని చాలా మృదువైన గొంతుతో చెప్పాను.

అది విని కొన్ని క్షణాల పాటు మౌనంగా ఉన్నాడు.

ఆ తర్వాత అన్నాడు– నెమ్మదిగానే. "తలుపు తీయి, డార్లింగ్!"

"నేను తీయలేను!" అన్నాను. "తాళం చెవి కింద ఫ్రంట్ డోర్ దగ్గర, అరిటాకు కింద ఉంది!"

దాన్నే మళ్లీ చెప్పాను. మళ్లీ మళ్లీ చెప్పాను. అనేకసార్లు చెప్పాను– మృదువుగా, నెమ్మదిగా. ఎన్నిసార్లు చెప్పానంటే, చివరికి అతను వెళ్లి చూడాల్సివచ్చింది. చివరికి దొరికిందనుకోండి. లోపలికి వచ్చాడు. ఠక్కున తలుపు దగ్గరే ఆగిపోయాడు.

"ఏంటిది?" అరిచాడతను. "అసలేం చేస్తున్నావు నువ్వు?"

అదేమీ పట్టించుకోకుండా నాపాటికి నేను పాకుతూనే ఉన్నాను. ఒకసారి నా భుజాల మీదనుంచి అతన్ని చూసాను.

"నువ్వూ, జేన్ ఉన్నప్పటికీ నేను బయటపడ్డాను!" అన్నాను. "పేపర్ చాలావరకూ పీకేసాను, కాబట్టి మీరు నన్ను మళ్లీ లోపల పెట్టలేరు!" అనీ అన్నాను.

ఇప్పుడు అతనెందుకు అలా స్పృహతప్పి పడిపోయినట్టు? గోడపక్కనే నా దారికి అడ్డంగా పడిపోయాడు.

ప్రతిసారీ అతని మీదగా పాకుతూ పోవాల్సి వస్తోంది!

★